క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం



అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిరాశ్రయుడైన పరువు ఘటోత్కజుడు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లిలో ఇటీవల విద్యుత్ షాక్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి రూ.2లక్షల విలువైన గృహోపకరణాలు, ఇల్లు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. గురువారం బాధిత కుటుంబాన్ని గుడాల గోపి పరామర్శించి కొంత ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ యాండ్ర లక్ష్మీకుమారి, ఉపసర్పంచ్ యాండ్ర గోపి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు, పార్టీ గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు మన్నె వెంకట నారాయణ, దేవ రాజేష్‌కుమార్, చెల్లింకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడపాడులో బతుకమ్మ పండుగ

యలమంచిలి: తెలంగాణలో ప్రాచుర్యం పొందిన బతుకమ్మ పండుగకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆదరణ లభిస్తుంది. మేడపాడు గ్రామంలో బుధవారం రాత్రి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఎత్తుకుని గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగారు. అనంతరం మాజీ సర్పంచ్ ఓదూరి కృష్ణమూర్తి ఇంటి వద్ద ఉన్న రామాలయం వద్ద బతుకమ్మలను, ఊయలలో ఉంచి, బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ, కోలాట భజన చేశారు. అనంతరం బతుకమ్మలను స్థానిక మంచినీటి చెరువులో కలిపారు. కమిటీ సభ్యులు అడబాల రాము, గంధం రాజా, వల్లభు గణేష్, గంధం శ్రీనివాస్, చీడే రవి తదితరులు పాల్గొన్నారు.

సాయం చేయడం ద్వారా మానసిక ఆనందం

పాలకొల్లు అర్బన్: ఎదుటివారికి సాయం చేయడం ద్వారా మానసిక ఆనందం కలుగుతుందని వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రియాంక టవర్స్ వద్ద గురువారం పేద రోగులకు కె.శ్రీనివాస్, వై.కరుణకు రూ.12 వేలు విలువైన మందులు సుధాకరరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్, శిరం ఆనందకృష్ణ తదితరులు పాల్గొన్నార

ఎలక్ట్రికల్ డీఈఈగా రామకృష్ణ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ డీఈఈగా సీహెచ్ రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన తణుకు సబ్ డివిజనల్ డీఈఈగా పని చేసి సాధారణ బదిలీల్లో భాగంగా పాలకొల్లుకు బదిలీ అయ్యారు. ఇంతకు ముందు ఎలక్ట్రికల్ డీఈఈగా పనిచేసిన వెంకట్రావు పాలకొల్లు రూరల్‌కి బదిలీ అయ్యారు. డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను రూరల్ ఏఈ ఎల్.శ్రీనివాసరావు, షేక్ బాజీ, ఆర్‌వీ అప్పారావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి

నరసాపురం: విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మధుకుమార్‌ను కోరారు. గురువారం విద్యుత్‌శాఖ సీఐటీయూ అనుబంధ కార్మికసంఘం నేతలు కామన సంజయ్‌చ గుబ్బల రామసుందరం తదితరులు మధుకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా పుష్పగుచ్ఛం అందించి స్థానికంగా ఉన్న సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈఈ ముధుకుమార్ పూర్తి సహకారం అందిస్తానని చెప్పినట్టు వివరించారు.

అపూర్వ కలయిక

పెనుమంట్ర: పెనుమంట్ర రామయ్య అచ్యుతానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి 1982–83 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెనుమంట్రకు చెందిన తేతలి గుర్రెడ్డి, ఎర్ర రాధేగోపాల్, తేతలి వేణుగోపాల్‌రెడ్డి ఆహ్వానం మేరకు 71 మంది పూర్వ విద్యార్థులు హాజరై పాఠశాల ఆవరణలో గడిపి గత అనుభవాలను అనుబంధాలను నెమరు వేసుకున్నారు. ముందుగా మృతిచెందిన ముగ్గురు పూర్వ ఉపాధ్యాయులు, 14 మంది పూర్వ విద్యార్థుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఇసుక మేటలు కనుమరుగు

- అక్రమ తవ్వకాల జోరుతో కనిపించని వైనం
- ధనార్జనే ధ్యేయంగా రెచ్చిపోతున్న అక్రమార్కులు



మొగల్తూరులో చెరువును తవ్వి గుట్టలుగా పోసిన మట్టి (ఫైల్)



కేపీ పాలెంలో మట్టిని తవ్వుతున్న జేసీబీ

మొగల్తూరు: ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఇసుక,మట్టి గుట్టలు కనుమరుగవుతున్నాయి. నియోజకవర్గంలోని కొందరు నేతల అండతో కేవలం ధనార్జనే ధ్యేయంగా ఇసుక, మట్టిని అయిన కాడికి అమ్మేసుకుంటున్నారు. మొగల్తూరు మండలంలో ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుకను అమ్మేసుకుంటున్నారు. అయితే భవిష్యత్‌లో జరగరానిది జరిగితే కేరళ లాంటి ఉపద్రవాన్ని చవిచూడకతప్పదని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. మండలంలోని రామన్నపాలెం, కొత్తోట, కాళీపట్నం, శేరేపాలెం, ముత్యాలపల్లి, మొగల్తూరు, కేపీ పాలెం, పేరుపాలెం, పాతపాడు గ్రామాల్లో సహజ సిద్ధంగా ఏర్పాడిన మట్టి, ఇసుక దిబ్బలతో పాటు పల్లపు భూములుండేవి. అయితే ఇసుక, మట్టిలో నాణ్యత ఉండటంతో ఇంటి పునుదుల్లోకి వాడడంతో ఈ మట్టి, ఇసుకకు మంచి గిరాకీ ఏర్పడింది. ట్రక్కు, లారీ రూ.6 నుంచి రూ.7 వేలకు. తీరప్రాంత ఇసుక రూ.10వేలు చొప్పున అయిన కాడికి అమ్మేసుకోవడంతో ఇసుక, మట్టి స్థానంలో భారీ గోతులు ఏర్పడ్డాయి.

సముద్ర ఇసుకను వదలని ఇసుకాసురులు

సునామీ లాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు తీరాన్ని ఆనుకుని ఉన్న ఇసుక దిబ్బలు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకునేవి. అయితే ఇటీవల సముద్ర ఇసుకకు గిరాకీ పెరగడంతో రాత్రి సమయాల్లో ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. కోస్టల్ రెగ్యులేటరీ భూముల్లో ఎటువంటి తవ్వకాలు, కట్టడాలు కట్టరాదనే నిబంధనలు ఉన్నా ఖాతరు చేయడంలేదు. రాత్రి సమయాల్లో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక గుట్టలు మాయమవుతున్నాయి.

గ్రామాల్లోకి వచ్చేస్తున్న వర్షపు నీరు

గతంలో ఎంత వర్షం కురిసినా వర్షపు నీరు నివాసాల మధ్యకు వచ్చేది కాదు. అయితే జాతీయ రహదారి విస్తరించడం, పాలకొల్లు, భీమవరంలో రైల్వే ట్రాక్ పనులు చేపట్టడం, పాలకొల్లు ఎల్ అండ్‌టీ ఆధ్వర్యంలో గృహ నిర్మాణలు చేపట్టడంతో ఇసుక, మట్టికి గిరాకీ ఏర్పడింది. దీంతో గ్రామాల్లో ఇసుక, మట్టి గుట్టలను ఇష్టానుసారం తవ్వేయడంతో వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచే పరిస్థితి లేక గ్రామాల్లోకి వచ్చి పడుతుంది. మొగల్తూరు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల చుట్టూ ఉప్పుటేరులు, డ్రెయిన్‌లు, సముద్రం ఉంది. ఇప్పటికే భారీ వర్షాలు కురిస్తే డ్రెయిన్‌లు పొంగి మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప, కొత్తోట, కాళీపట్నం పల్లిపాలెం,పాతపాడు ఇందిరమ్మ కాలనీలోకి నీరు వచ్చి చేరుతుంది. అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను అరికడితే ఎంతో కొంత నష్టాన్ని నివారించవచ్చని పలువురు కోరుతున్నారు.

భవిష్యత్‌లో ఇబ్బందే



ఉప్పుటేరు, డ్రెయిన్‌లు ఆనుకుని నివసించే వాళ్లకు భవిష్యత్‌లో ఇబ్బందే. భారీ వర్షాలు కురిసే సమయంలో డ్రెయిన్‌లు పొంగిపొర్లుతుంటాయి. గతంలో డ్రెయిన్ పొంగినా మట్టిదిబ్బలు అడ్డుకునేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– బొడ్డుపల్లి సుబ్బారావు,మొగల్తూరు

పచ్చని భూములను కూడా తవ్వేస్తున్నారు



ఇటీవల జాతీయ రహదారి, రైల్వే పనులకు ఇసుక, మట్టి అవసరం కావడంతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో పచ్చని భూములు కూడా కనుమరుగువుతున్నాయి. అవసరం లేకపోయినా చెరువులను కూడా తవ్వేస్తున్నారు.

– అడ్డాల సాంబమూర్తి, లక్కువారితోట, రామన్నపాలెం

అనుమతులు లేకుండా తవ్వితే చర్యలు



తీరప్రాంతంలో అనుమతులు లేకుండా ఇసుకను తవ్వినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను కూడా సీజ్ చేస్తాం. ప్రజలు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలి.

– జి.వాసు, ఎస్సై, మొగల్తూరు

నగరేశ్వరుని సన్నిధిలో పూజలు



పెనుగొండ నగరేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గురువారం దుర్గాష్టమి సందర్భంగా 102 కన్యల పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీనగరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం మహాలింగార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వందలాది మంది కన్యలు అమ్మవార్లకు 102 కన్యల పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిత్యాన్నదాన సత్రంలో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు ఏర్పాట్లు చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



సోమరాజు చెరువులో సీపీఎం పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: సోమరాజు చెరువ పంచాయతీగా గ్రామ ప్రజలు అవసరాలు తీర్చాలని సీపీఎం జిల్లా నాయకుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం సోమరాజు చెరువులో నిర్వహించిన సీపీఎం గ్రామ మహాసభలో ఈ మేరకు తీర్మానం చేశారు. గత ప్రభుత్వంలో పంచాయతీ ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించినా, నేటి వరకూ సోమరాజు చెరువు ప్రజలు వారి సమస్యలు పరిష్కారానికి కొతాలపర్రు, తామరాడు, మునమర్రు గ్రామ పంచాయతీలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగైదు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ గ్రామ కార్యదర్శిని నియమించకపోవడం విచారకరమన్నారు. నూతన కార్యదర్శిని ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మహాసభలో గ్రామ శాఖ కార్యదర్శిగా కౌరు జగన్నాథాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తంగెళ్ల శ్రీను, మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, పాలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



అయ్యప్పస్వామికి నైవేద్యం సమర్పిస్తున్న గుణ్ణం నాగబాబు దంపతులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణ శివారు నరసాపురం రోడ్డులో కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, రాజరాజేశ్వరి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాగబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాలధారులకు అన్నదానం చేయడం భగవంతుని సంకల్పమని అన్నారు. రోజుకో దాత చొప్పున వంద రోజులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు బాబుల్‌స్వామి, కమిటీ సభ్యులను అభినందించారు. సుమారు 300 మంది స్వాములు అన్నదానంలో పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సంఖ్య రాబోయే రోజుల్లో ఇంకా పెరుగుతుందన్నారు.

మహిళా శక్తిని ప్రోత్సహించాలి



యలమంచిలి: కాంబొట్లపాలెంలో ర్యాలీలో పాల్గొన్న మహిళలు



పెనుగొండ: బాలికా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: దేశాభివృద్ధి మహిళల స్వేచ్ఛతోనే సాధ్యమనే సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తించి మహిళల భావ స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో పి.నాగరత్నం కోరారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గురువారం కాంబొట్లపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే ఉన్నత విద్య అవసరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఆమె కోరారు. కార్యక్రమంలో కాంబొట్లపాలెం సర్పంచ్ చిలుకూరి సూనావతి అంగన్ వాడీ వర్కర్లు ఎం.ధనలక్ష్మి, వి.శ్రావణి దుర్గ, భవాని, మాధవి, కుమారి, చినతల్లి, లక్ష్మీ దుర్గ, పద్మశ్రీ, సునీత పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. గురువారం అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయకుమారి మాట్లాడుతూ 2012 నుంచి అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారన్నారు. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలనార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజు సందర్భంగా అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు వివాహాలపై అవగాహన కల్పించడమే బాలికాదినోత్సవం లక్ష్యమన్నారు. బాలికలు, యువతులు అన్ని రంగాల్లోనూ ముందంజవేయాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని గురువారం కిషోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. మహిళా కార్యదర్శి ఆర్.హేమశ్రీ మాట్లాడుతూ కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం.శ్రీదేవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూవాడా శరన్నవరాత్రి సందడి



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో దుర్గాదేవి అలంకరణ



పెనుగొండ: దుర్గాదేవిగా మూలవిరాట్ వాసవీ మాత



పెనుగొండ: వడలిలో శాకంబరిగా కనకదుర్గమ్మ



నరసాపురం: ప్రత్యేకాలంకరణలో రాయిపేట కనకదుర్గమ్మ



పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేకాలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

పెనుగొండ: శరన్నవరాత్రులు గురువారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతను దుర్గాదేవిగా అలంకరించారు. వడలిలోని వివేకానంద సర్కిల్‌లో కనకదుర్గమ్మను శాకంబరిగా అలంకరించారు. ఆచంట పెదమల్లంలోని మాచేనమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దసరా మహోత్సవాల నేపథ్యంలో గురువారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పేరుపాలెం నార్త్ పంచాయతీ రజకుల పేటలోని గ్రామస్తులు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం గ్రామంలోని మహిళలు, పురుషులు అంతా కలిసి పేరుపాలెం తీరంలో అమ్మవారి కలశాలకు పూజలు నిర్వహించి అక్కడే అన్నప్రసాదాలను స్వీకరించారు. అనంతరం శుభ్రం చేసిన 54 కలశాలలో సముద్రపు నీరు నింపి ఊరేగింపుగా గ్రామానికి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం 54 కలశాలతో తీసుకువచ్చిన నీటితో అమ్మవారికి పూజలు జరిపి దుర్గాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే స్థానిక భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ, పార్వతీ దేవి ఆలయంలోను భక్తులు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. పేరుపాలెం నార్త్ గ్రామంలోని అమ్మవారి ఆలయంలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొన్నారు. రామన్నపాలెం, శేరేపాలెం ,కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాథపురం, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లోని ఆలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నరసాపురంలో..

నరసాపురం: పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద జరుగుతున్న 40వ దేవీనవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు శ్రీగౌరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. పాతబజార్ వలవారివీధివద్ద, రాయిపేట పుంతలో ముసలమ్మఅమ్మవారి ఆలయం వద్ద, గడ్డిబజార్‌వద్ద ఉన్న ప్రసిద్ధకనకదుర్గ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చినమామిడిపల్లి నాగారమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయిపేట కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అలాగే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. ప్రాకార మండపంలో పుష్పాలతో శివలింగాకారం ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను, స్వామివార్లను దర్శించుకున్నారు.



మొగల్తూరు: తీరం నుంచి కలశాలతో పాదయాత్రగా బయలుదేరుతున్న భక్తులు



నరసాపురం: స్టీమర్‌రోడ్డులో అమ్మవారి పూజల్లో కమిటీ ప్రతినిధులు



మొగల్తూరు: వడయార్‌పేటలోని అమ్మవారిని పూజిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ముత్యాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ముత్యాలపల్లిలో ముత్యాలమ్మను దర్శించుకుంటున్న, అధికారులు, భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులతో పాటు ఇటీవలే ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎం.అరుణ్ కుమార్, మొగల్తూరు గ్రూప్ దేవాలయాల ఈఓ శ్రీనివాస రెడ్డిలతో పాటు ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకటలాడింది.

సినీ నిర్మాత అడ్డాల చంటిని పరామర్శించిన గుడాల గోపి



సినీ నిర్మాత అడ్డాల చంటిని పరామర్శిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: మాతృవియోగంతో బాధపడుతున్న సినీ నిర్మాత అడ్డాల చంటిని అతని సోదరులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం పరామర్శించారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మకాయల రామకృష్ణ మాతృమూర్తి నిమ్మకాయల నాగమణి దశదిన కర్మకాండలు యలమంచిలి మండలం కొంతేరులో నిర్వహించారు. గుడాల గోపి పాల్గొని నాగమణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు ఉన్నారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొక్కా చంటి

నరసాపురం: కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం నరసాపురం డివిజన్ అధ్యక్షుడు బొక్కా చంటి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మీరా గ్రంథాలయ భవనంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంలో మాదిరిగా కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్‌శాఖ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు మాట్లాడుతూ పక్క రాష్ట్రం తెలంగాణాలో ప్రమాదవశాత్తూ దెబ్బలు తగిలిన కార్మికులకు తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు ఇస్తున్నారని, అదే విధంగా మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. గీత వృత్తిని రక్షించడానికి ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బొక్కా సోమేశ్వరరావు, గుబ్బల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ

వీరవాసరం: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, హృదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పెర్కిపాలెం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవపై అంకితభావంతో పని చేస్తున్న యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ను అభినందించారు. క్యాన్సర్, దంత, కంటికి, చర్మ వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. జక్కంపూడి రంగారావు, నూకల ధనుంజయ్, పెనుమాక రామ్మోహనరావు, జక్కంపూడి మధన్, వీరుకొండ దుర్గా ప్రసాద్, శిరిగినీడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

భీమవరం: భీమవరం బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్‌లో పనిచేస్తున ఒకవ్యక్తి ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి కడప జిల్లాకు చెందిన ఎ.శ్రీనివాస్‌గా స్థానికులు చెబుతున్నారు. మృతుడు కొంత కాలంగా టి.బి వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లక్ ఉంటేనే కిక్

- ప్రభుత్వం నుంచి ప్రైవేట్ చేతికి మద్యం దుకాణాలు
- మద్యం షాపులపై అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఆశావహులు



పెనుగొండలో మద్యం దుకాణం

పెనుగొండ: మద్యం దుకాణాల కేటాయింపు లాటరీలో లక్‌ను పరీక్షించుకోవడానికి సిండికేట్‌లు, ఆశావహులు సిద్ధం అవుతున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో వెనుకంజ వేసినా, మద్యం విధానంలో మాత్రం ముందడుగు వేసి మద్యం ప్రియులకు కిక్కు ఎక్కించేందుకు రంగం సిద్ధం చేసింది. విచ్చలవిడి అమ్మకాలకు తెరతీసేందుకు రంగం సిద్ధం తీసింది. మద్యం దుకాణాలను ప్రభుత్వం నియంత్రణలో నుంచి ప్రైవేట్‌కు కట్టబెట్టడానికి నిర్ణయం తీసుకోవడంతో ప్రైవేట్ వ్యక్తులు సిద్ధం అవుతున్నారు. గత ప్రభుత్వంలో దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ, విచ్చలవిడి అమ్మకాలపైనా నియంత్రణ ఐదేళ్ల పాటు కొనసాగించింది. నూతన ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికడంతో ఈ నెల 12న ప్రభుత్వం నుంచి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి దుకాణాలు మారబోతున్నాయి. ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు మండలాల్లో 23 దుకాణాలు ఉన్నాయి. అత్యధికంగా పెనుగొండలో 9 దుకాణాలు, పెనుమంట్రలో 6 దుకాణాలు, ఆచంట, పోడూరు మండలాల్లో నాలుగు చొప్పున దుకాణాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు రెండు సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోకి వచ్చాయి. పెనుగొండ, పెనుమంట్ర మండలాలు తణుకు, ఆచంట, పోడూరు మండలాలు పాలకొల్లు స్టేషన్ పరిధిలోకి వచ్చాయి.

లైసెన్స్ ఫీజులో మతలబు

జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు, రూ.65 లక్షలు నిర్ణయించారు. అయితే, ప్రభుత్వం జనాభాను గ్రామ ప్రాతిపదికన తీసుకోకుండా మండల స్థాయికి తీసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలకు రూ.65 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ మండల స్థాయి జనాభా ప్రాతిపదికన తీసుకోవడం ప్రతీ దుకాణానికి రూ.65 లక్షలు చెల్లించాల్సిందే. లాటరీలో లక్ చెక్ చేసుకోవాలంటే రూ. 2 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించాలి. ఈ నగదు నాన్ రీఫండబుల్ కావడంతో కొంతమందిలో సంశయం నెలకొన్నా సిండికేట్లు మాత్రం ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు.

మందకొడిగా దరఖాస్తులు

రాజకీయ నాయకులకు భాగస్వామ్యం, లాభనష్టాలపై విపరీతమైన ప్రచారం జరుగుతుండడంతో దరఖాస్తులు మందకొడిగా పడుతున్నాయి. పెనుగొండ మండలంలో ఆదివారం సాయంత్రానికి రెండు, ఆచంట మండలంలో 18, పోడూరు మండలంలో 8 దరఖాస్తులు రాగా, పెనుమంట్ర మండలంలో ఇప్పటి వరకూ బోణీ కాలేదు. ఈ దరఖాస్తులు అన్నీ ప్రస్తుతానికి ఆఫ్‌లైన్ విధానంలోనే వేశారు.ఆన్‌లైన్‌లో కూడా మరికొన్ని దరఖాస్తులు వచ్చి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

కరుణించమ్మా..కనకదుర్గమ్మ

పెనుగొండ: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో లలితా త్రిపుర సుందరిగా దర్శనం ఇచ్చారు. ఆచంట మండలంలో ప్రసిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనం ఇచ్చారు.

యలమంచిలిలో..

యలమంచిలి: దసరా శరన్నవరాత్రి వేడుకలు గ్రామాలలో ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలోను ప్రధాన కూడళ్లలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేసి భక్తులు ఉదయం, సాయంత్రం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. అడవిపాలెం గ్రామంలోని పల్లపువీధిలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఆదివారం పిండి సుబ్బారావు, సూర్యావతి దంపతులు పీటలపై కూర్చుని గణపతి పూజ, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. వీరితో ఆగమప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేయించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల వేడుకలో భాగంగా ఆదివారం అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులు దర్శించుకున్నారు. స్థానిక పార్వతీ దేవి ఆలయంలోను, భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలోనూ, కూరగాయల మార్కెట్‌లో నెలకోల్పిన అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ముత్యాలపల్లిలోని ప్రధాన సెంటర్లో నెలకొల్పిన అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకిరించి పూజలు చేశారు. శేరేపాలెం ,కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాథపురం, కేపీ పాలెం,పేరుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నరసాపురంలో..

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణం లోవైభవంగా జరుగుతున్నాయి.పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద 40వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీకూష్మాండదుర్గాదేవిగా అలంకరించారు. చిన్ని రమేష్, సునీత దంపతులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరించారు. గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాల్లో అమ్మవారిని వెండి వస్తువులతో ప్రత్యేకంగా అలంకరించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల చలువ పందిళ్లు దుర్గాదేవి నామంతో దద్దరిల్లాయి. చిట్టవరం గ్రామంలోని మదన గోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త చల్లా వెంకటస్వామి, నాగలక్ష్మి దంపతులు, గ్రంధి శ్రీనివాస్, వనజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారవ గ్రామంలో ముత్యాలమ్మఆలయంవద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పర్రు, కె.బేతపూడి, ఎల్బీచర్ల గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దాసుగుడి వీధిలో..

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 5వ వార్డు దాసుగుడి వీధిలో గత 33వ సంవత్సరాలుగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతిర్లింగార్చన చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నెగ్గిపూడి గ్రామంలో ఉన్న శ్రీవనుములమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లను ఆదివారం శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీవనుమలమ్మ, శ్రీకనకదుర్గమ్మ, శ్రీవారాహి అమ్మవార్ల ప్రతిమల వద్ద ప్రతి రోజూ మహిళలు కలశ, శ్రీచక్ర, కుంకుమ పూజలు నిర్వహిస్తూ, లలితా పారాయణం చేస్తున్నారు.



నరసాపురం: స్టీమర్‌రోడ్డులో శ్రీకూష్మాండదేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



పెనుగొండ: నగరేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణా మూల విరాట్ వాసవీ మాత



పాలకొల్లు అర్బన్: దాసుగుడి వీధిలో జ్యోతిర్లింగార్చన చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



నరసాపురం రూరల్: చిట్టవరంలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



పెనుమంట్ర: నెగ్గిపూడిలో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



మొగల్తూరు: లలితాత్రిపుర సుందరీదేవి పూజలు చేస్తున్న దృశ్యం



యలమంచిలి: అడవిపాలెంలో కనకదుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

నేడు కాళీపట్నంపడమరలో ఉచిత పశు వైద్య శిబిరం

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారిణి డాక్టర్ నీలిమ తెలిపారు. ఈ మేరక ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో ఎదకు రాని ,లేదా చూడుకట్టని పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు నిపుణలైన వైద్యులతో నిర్వహిస్తామని, పశువులకు టీకాలు కూడా వేస్తామన్నారు. గ్రామంలోని పశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

మొగల్తూరు: మండలంలో అక్రమం ఇసుక తరలిస్తున్న మూడు లారీలు, ఒక జేసీబీ శనివారం అర్ధరాత్రి సీజ్ చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా ఇసుకు తరలింపునుకు సంబంధించిన ఎటువంటి అనుమతులు లేవని గుర్తించామని వెంటనే లారీలను, జేసీబీను సీజ్ చేశామని స్పష్టం చేశారు. మండలంలో అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుకను తవ్వడం లేదా తరలించడానికి పాల్పడితే వాహనాలను సీజ్‌చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపరం: వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని నరసాపురం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు కోరారు. ఆదివారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో వృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు విదేశాల్లోనో, వేరే రాష్ట్రాల్లోనో ఉండటం వల్ల ఇళ్ల వద్ద వృద్ధులను అనాథలుగా వదిలేస్తున్నారని అన్నారు. జీవిత చరమాంకంలో వృద్ధులు తోడులేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు ఆలనా, పాలనా చూడకపోతే వృద్ధులు సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ విషయంలో అసోసియేషన్ సహకరిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా వివిటధ రంగాల్లో సేవలందించిన 10 మంది వృద్ధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బి.యాదగిరి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, షేక్ సిలార్‌సాహెబ్, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, BOKKA SUBRAHAMANYAM (NEW NAME), S/o.Srinivasa Rao, Previously called BOKKA SUBRAHMANYAM (OLD NAME) Resident of D.No.25-20, Krindhi Pora, Achanta Village, Achanta Mandal, West Godavari District, Andhra Pradesh, Pin. code 534123. Now changed my name from BOKKA SUBRAHMANYAM (OLD NAME) to BOKKA SUBRAHAMANYAM (NEW NAME) Today onwards Use my New Name for all further Transactions.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నర్సయ్య అగ్రహారం పేకాటస్థావరంపై దాడి చేసి 12 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం .నాగరాజు ఆదివారం చెప్పారు. నర్సయ్య అగ్రహారంలోని ఇంటిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పేకాడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,430 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

నేడు నరసాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జివియస్ రామకృష్ణంరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు అందరూ విధిగా ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

పైపులైన్ లీకేజీలను అరికట్టాలి



పైపు లీక్ అవ్వడంతో బురదమయంగా మారిన రోడ్డు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో పాడిదారి వీధిలో మంచినీటి పైపులు లీకవుతున్నా పంచాయతీ అధికారులు గానీ, సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఆ వీధి నీటితో నిండి పోయి, బురద మయంగా మారుతోంది. స్థానికులు గత్యంతరం లేక ఆ బురద నీటిలోనే సంచరిస్తున్నారు. జిల్లా స్థాయి పంచాయతీ ఉన్నతాధికారులు కూత వేటు దూరంలోనే ఉన్నప్పటికీ, పంచాయతీ సిబ్బంది గానీ అధికారులు గానీ విధులు నిర్వహించడంలో అలసత్వం చూపుతున్నారు. ఇటీవలే గాంధీ జయంతి పురష్కరించుకొని నెల రోజులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

నరసాపురం ఆర్టీసీ డిపోలో తీవ్ర విషాదం



డిపోగేట్ వద్ద సంతాపం తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపోలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నరసాపురం డిపో నుంచి విశాఖపట్టణం వెళుతున్న బస్సు ఆదివారం తెల్లవారుజామున విశాఖ దగ్గరిలోని కసింకోట వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో డ్రైవర్ గుత్తుల జగన్‌మోహన్ రావు (50) మృతి చెందడంతో ఆర్టీసీ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. జగన్ మృతిపై ఆర్టీసీ డిపోగేట్ వద్ద కార్మికులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. సరిగ్గా మరో గంటలో గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో ప్రమాదం రూపంలో తోటి కార్మికుడు ప్రాణాలు కోల్పోవడాన్ని కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న నరసాపురం ఎస్ సుబ్బన్నరెడ్డి, అసిస్టెంట్ డిపో మేనేజర్ లక్ష్మి విశాఖపట్టణం బయలుదేరి వెళ్లారు.

సింగిల్ డ్రైవర్ విధానానికి స్వస్తి పలకాలి

దూర ప్రాంతాలకు కొంతకాలంగా సింగిల్ డ్రైవర్‌ను ఆర్టీసీ డ్యూటీలకు పంపిస్తుంది. ఈ దూర సర్వీస్‌ల్లో కండక్టర్ ఉండరు. డ్రైవర్ ఒక్కడే టికెట్‌లు ఇవ్వడం, చెకింగ్ చేసుకోవడం చేయాలి. బస్సుకు సంబంధించిన ఇతర సమస్యలు మొత్తం అతనొక్కడే పర్యవేక్షించుకోవాలి. మళ్లీ ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు వచ్చినా అధికారులచేత తిట్లు తినాలి. దీంతో దూర సర్వీస్‌లకు డ్యూటీలకు వెళ్లే డ్రైవర్లు తీవ్ర ఆందోళన, ఒత్తిడికి లోనవ్వడం జరుగుతోంది. ఇలాంటి ఒత్తిడికి గురికావడంతో డ్రైవర్ జగన్ ప్రాణాలు కోల్పోయాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పద్ధతికి ఆర్టీసీ స్వస్తి పలకాలని కోరుతున్నారు.

తల్లడిల్లుతున్న కుటుంబం

యలమంచిలి: కశింకోట వద్ద జరిగిన ప్రమాదంలో నరసాపురం ఆర్టీసీ డిపో కండక్టర్ గుత్తుల జగన్‌మోహన్ (50) ఆకస్మిక మరణంతో అతని కుటుంబం తల్లడిల్లుతోంది. యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందిన జగన్‌మోహన్ తండ్రి నరసింహశెట్టి ఏడాది క్రితమే మరణించారు. ఆ విషాదం నుంచి బయటపడక ముందే కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి పెను శాపంగా మారింది. జగన్‌మోహన్‌కు తల్లి లీల, భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సిరుదీప్ హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు పవన్‌కుమార్ హోటల్ మేనేజిమెంట్ చదివి ఆ వృత్తిలో ఉన్నాడు. జగన్ ఆకస్మిక మరణంతో ఇలపకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి.